
కథ

# ఇనప్పెట్టె

## జయసూర్య



వర్షం వెలిసింది. ఆకాశంలో నల్లటి మబ్బు చాటు నుంచి చంద్రుడు బయటకు రావడంతో వెన్నెల ఆ మేడ మీద పడుతోంది. ఆ ఊళ్ళో ఇప్పటికీ నా చిన్నప్పటి ఆ మేడను రామనాథం గారి మేడ అంటారు. ఆ మేడ గోడలు కూలిపోయాయి. పై కప్పు ఇంచు మించు లేదు. ఇంటి దూలాలు కూలి పైకప్పు పడిపోయింది. పెద్దగదుల ఆ ఇంటిని ఎండా, వానా స్వేచ్ఛగా ఏలుతున్నాయి.

జిల్లేళ్ళు, రావి, పిచ్చిమొక్కల గుబురులోంచి పూలు తొంగిచూస్తున్నాయి. ఎత్తైన మండువా లోగిలి నిలబడిన ముందు ప్రాంగణం దిగాలుగా ఉంది. అరుగులు, స్తంభాలు శిథిలం అయినా ఒకనాటి దర్పం కనపడుతోంది.

ఆ ప్రాంతంలో ఒకప్పుడు గొప్పగా చెప్పుకునే మేడ సింహద్వారం, గుమ్మాలు పెకలించిన గుర్తులున్నాయి. మెట్లు పైకి కొంతవరకే ఉన్నాయి. పైనుంచి మేడ కిందకు చూస్తే అప్పుడే వర్షం కురిసి తడిసిన ఆనవాళ్లతో ఆ మొండిగోడల ఇంట్లో వెన్నెల పడడంతో అలిసి సేదతీరుతున్న అందం మెరుస్తోంది. అందులో ఉంది ఇంకా ఒక ఇనప్పెట్టె.

★ ★ ★

అమెరికాలో ఉంటున్నా నాకు మా ఊరు, చిన్నప్పటి రోజులు గుర్తు వస్తుంటాయి. ఊరు చుట్టూ గోస్తనీ కాల్వలో ఈత కొట్టేరోజులు, ఎండాకాలంలో కాల్వలో నడిచి పంట చేలలో పరుగెత్తే ఆటలు గుర్తుకొచ్చినప్పుడు ఆ జ్ఞాపకాలు క్షణం సేపైనా కదిలిస్తుంటాయి. ఒకే కంచంలో ఆవకాయ అన్నం కలిపి మేం చుట్టూ కూర్చుని చేతులు చాపితే అమ్మ పెట్టే ముద్దలు గుర్తుకొస్తాయి. నాన్నతో కలిసి చేయి పట్టుకుని మేడవైపు నడిచే రోడ్డు చెరువు గట్టు, పెద్ద మర్రి మెదులుతాయి. ఇంచుమించుగా ఆరు అడుగుల పొడవైన దబ్బపండు శరీరఛాయ, ముతక ఖద్దరు గాంధేయవాది రామనాథంగారు ఆ ఊరందరికీ పెద్ద.

గాంధీగారేమిటి, ఎవరు వచ్చినా ఆ ఇంట్లోనే విడిది. ఎప్పుడూ ఒక్కటే సందడి. ఏడాది పొడుగునా సంతర్పణాలు, సమారాధనలు, పెళ్లిళ్ళు, సంబరాలు, పెద్ద పెద్ద బానలతో ఊరగాయలు. రామనాథంగారి చేతికి ఎముక లేదు. ఊళ్ళో ఎవరి ఇంట్లో ఏం జరిగినా మేడలోనే హడావిడి.

హిందీ విద్యాలయం, వందేమాతరం, సహాయ నిరాకరణలు, సత్యాగ్రహాలు, మా ఊళ్ళో అదే కేంద్రం క్రమేపీ గాంధీగారి పోరాటం రోజులలో లాఠీఛార్జీలు, జైలుశిక్షలు భోగాలు అంతరించి త్యాగాలు రావడంతో రామనాథంగారి ఆస్తి హారతి కర్పూరమైంది. ఆయనకు వృద్ధాప్యం, కుటుంబం చెల్లాచెదరైంది. అప్పు ఇచ్చిన వాళ్లకు మేడ స్వాధీనమైంది. దారిద్ర్యం మిగలడంతో కొడుకులు పొట్టచేత్తో పట్టుకుని తమ దోవ వెతుక్కోవలసి వచ్చింది. రామనాథం గారికి నిలువనీడ కరువైంది. ఎవరి పంచనా ఆధారపడని స్వాభిమాని, త్యాగి కావడంతో మా గ్రామ చావడిలో ఆఖరిరోజులు గడిపారు. కానీ రామనాథం గారు గానే తనువు చాలించారు.

కొనుక్కున్న వాళ్ళు కూడా మేడ నిలబెట్టుకోలేక పోవడంతో చేతులు మారింది. వివాదాలు తల ఎత్తడంతో కొంత పడగొట్టడం, మిగిలిన మేడ భాగం పట్టించుకునేవాళ్ళు లేకపోవడంతో రూపురేఖలు మారిపోయాయి. ఊరు మారి పట్టణమైనా ఆ శిథిలాలయం అట్లాగే ఉంది. అపార్టుమెంట్. భవనాలు చుట్టూ వెలిశాయి. చుట్టూ నాగరికం మధ్య రామనాథం గారి మేడ ఒక స్మృతిగా మిగిలింది. పటిష్టమైన ప్రహరీ గోడలు కూలతోస్తే కానీ బయటపడలేని తాతల తరాల పూర్వీకుల ఇనప్పెట్టె ఇంచుమించు స్థాపితంగా ఉండిపోయింది.

టన్నుల బరువుతో నిలువెత్తున్న ఆ ఖాళీ ఇనప్పెట్టెను దొంగలు కూడా పట్టుకెళ్లడం సాధ్యం కాకపోవడంతో కొంతకాలం అలాగే ఉంచారు. పూర్వీకుల ఖజానాగా ఒకప్పుడు బంగారు, వెండి నాణాలు ఇత్తడి బిందెలు అందులో ఉండేవిట.

కాగితం నోట్లు లేని రోజులవి. ఇనప్పెట్టె గది ప్రత్యేకంగా లక్ష్మీకళతో ఉండేది. ఏడువారాల నగలు, రవ్వల దుద్దులు, గాజులు, వంకలు, ముక్కుపుడకలు, జడలు, వడ్డాణాలు లక్ష్మీసంపన్నత నిక్షిప్తమై ఉండేదిట. మేడ, ఐశ్వర్యం హరించుకుపోవడంతో ఇనప్పెట్టె మాత్రం మిగిలింది.

నేను ఎప్పుడు మాఊరు వచ్చినా మేడవైపు వెళ్తాను. అందులోకి ఒకసారి తొంగిచూసి గతం గుర్తుచేసుకుంటాను.

★ ★ ★

అమెరికాలో స్థిరనివాసం ఏర్పరచుకోవడంతో ఇంచుమించు మాఊరు అంతగా గుర్తు రావడం తగ్గిపోయింది. తాతలు,తండ్రులు ఏనాడో గతించడం బంధువులు, చిన్ననాటి స్నేహితులు కూడా కనుమరుగు అవుతుండడంతో ఈమధ్య మా ఊరు వెళ్లడం లేదు కానీ రామనాథంగారి మేడలో ఇనప్పెట్టె చాలా కాలం అలాగే ఉందని అక్కడ తొంగిచూసే వాళ్లకు భయం కలిగేటట్లు త్రాచుపాములు బుసలు వినిపించేవని విన్నాను. యాతా వాతా ఆ ఇనప్పెట్టెను చుట్టుకుని ఉండే నల్లత్రాచు అదృశ్యమైందని అప్పుడే ఎంతో శ్రమతో కదల్చగలిగారని తెలిసింది. రామనాథంగారి మేడ గురించి, ఇనప్పెట్టె త్రాచుపాము వృత్తాంతం మా పిల్లలకు కథలుగా వివరించి చెప్తుంటాను. వాళ్ళు శ్రద్ధగా, వింతగా, ఆసక్తితో వినడం నాకు సంతృప్తి కలిగిస్తుంది. ఆ చిన్ననాటి బాంధవ్యపు స్పృహను నా జీవితాంతం పదిలపరుచుకుంటాను.

★

